క్లుప్తంగా

ఉచిత రేషన్ బియ్యం పంపిణీ

ఎర్రగుంట్ల : నూతన సంవత్సరం కానుకగా ప్రభుత్వం ప్రకటించిన ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇది వరకు కిలో బియ్యానికి రూ.2 తీసుకుంటుండగా, ఇప్పుడు కార్డుదారునికి ఉచితంగా ఇవ్వనున్నారు. బియ్యంతో పాటు అరకేజీ చక్కెర, కేజీ కంది పప్పు ఇస్తారు. అరకేజీ పంచదారకు రూ.17, కేజీ కందిపప్పుకు రూ.67 వసూలు చేస్తున్నారు. ఏఏవై కార్డుదారులకు కేజీ పంచదార రూ.13.50 అందజేస్తున్నారు.

వసతులు మెరుగుపరచండి

కమలాపురం : మండలంలో ఇళ్ల నిర్మాణం జరుగుతున్న జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్, మండల కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వారు మండలంలోని పుట్లంపల్లె, గొళ్లపల్లె, కమలాపురంలోని జగనన్న కాలనీలను సందర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు అధికారులు కృషి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, నీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు మెరుగుపరచాలన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణానికి రూ.1.8లక్షలు సరిపోదని, ప్రభుత్వం స్పందించి ప్రతి ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాలని వారు కోరారు.

అనాథ వృద్ధులకు అల్పాహారం పంపిణీ

వేంపల్లె : పట్టణంలోని పాత గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు. శుక్రవారం వేంపల్లె ఆయాన్ బజాజ్ టూ వీలర్ షోరూం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో వృద్ధులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ వృద్ధులపట్ల శ్రద్ధ చూపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గౌసుల్లా, కరీముల్లా, సలీం, అనాథ వృద్ధులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో పూడికతీత

చెన్నూరు : కేసీ కెనాల్‌కు సంబంధించిన ఆయకట్టు రైతులు కేసీ కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టారు. శుక్రవారం క్రేన్ సాయంతో చెన్నూరు పాత రోడ్డువద్ద నుంచి కింద ఆయకట్టు రామనపల్లె పెన్నానదిలోకి వెళ్లే రోడ్డు వరకు కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. గతంలో పూడికతీత పనులను అధికారులు చేపట్టగా ఇప్పుడు రైతులే తమ సొంత నిధులతో పనులు చేయించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేముల : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ పెట్రోలింగ్, రెక్టిఫికేషన్ మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాన్ని గమనించి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

కొండాపురం : మండలంలోని కొండాపురం 33, 11 విద్యుత్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ ఓబులేసు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

చెన్నూరు : మండలంలోని రాచిన్నాయపల్లె గ్రామానికి చెందిన పోలయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయాన్ని సర్పంచ్ సొంటం నారాయణరెడ్డి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ఆ కుటుంబానికి సానుభూతిని తెలియజేసి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, డీలర్ చంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి కఠిన చర్యలు

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని ఎనుగువారిపల్లె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి కాకుండా బాలికలకు వివాహం చేస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

– మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : సచివాలయ కార్యదర్శులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సచివాలయ కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, రోడ్డు రిపేర్లు, ప్లాస్టిక్ ఫ్లెక్సీ నిషేధం తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు.

హామీలను నెరవేర్చాం.. ఆశీర్వదించండి

- ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామంటూ ప్రజలకు భరోసా ఇస్తూ..
- తుమ్మలపల్లె గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి



సంక్షేమ పథకాలపై వృద్ధుడిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : అమ్మా నేను మీ బిడ్డను.. మీకు ఏ సమస్యలున్నా నాతో చెప్పండి.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తా.. అంటూ జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి వృద్ధులు, మహిళలు గ్రామస్తులకు భరోసా కల్పించారు. శుక్రవారం సాయంత్రం ఎర్రగుంట్ల మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ మూడున్నరేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకంటే ప్రజలకు ఎక్కువ మేలు చేకూర్చి రాష్ట్రాన్ని వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడుపుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. 2014–19 కాలంలో ప్రజలకేం చేశారో టీడీపీ నాయకులు చెప్పాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం అర్హత కలిగిన వారందరికీ స్థలాలిచ్చి సొంతింటి కలను సాకారం చేయాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ప్రమాదంలో కాలుకు గాయమై బాధపడుతున్న ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ తమ్మిశెట్టి బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సురేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, రవీంద్రరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివారెడ్డిలతో పాటు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ సుబ్బయ్య, ఏపీఎం జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుమ్మలపల్లి గ్రామంలో..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వలసపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేస్తారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డితో తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణతో ఉత్తమ ఫలితాలు



లేగ దూడల ప్రదర్శన ప్రారంభిస్తున్న పశు సంవర్థక శాఖ అధికారులు

వల్లూరు : పశువుల్లో కృత్రిమ గర్భధారణ వల్ల పాడి రైతులు ఉత్తమ ఫలితాలను పొందవచ్చునని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ పేర్కొన్నారు. జాతీయ కృత్రిమ గర్భధారణ పథకంలో భాగంగా పశు సంవర్ధక శాఖ , ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వల్లూరు మండల పరిధిలోని ఇసుకపల్లె గ్రామంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేగ దూడల పెంపకంలో సరైన మెలకువలను పాటించడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు. లేగ దూడల పెంపకంలో పాటించాల్సిన మెలకువలు, జాగ్రత్తలు, కృత్రిమ గర్భధారణ వల్ల ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించి, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ గ్రామాల నుంచి ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడలను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దూడలకు సంబంధించిన రైతులకు బహుమతులను అందజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న మిగిలిన లేగ దూడల రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి డాక్టర్ రమేష్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పశు వైద్యులు డాక్టర్ మారుతీ ప్రతాప్ రెడ్డి, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం సభ్యులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు

– ఎంవీఐ ప్రసాద్

పులివెందుల రూరల్ : రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కంటి వైద్య నిపుణులచే ఆర్టీసీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎంవీఐ ప్రసాద్ మాట్లాడుతూ కంటి చూపు సక్రమంగా లేకపోతే అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. బస్సులు నడిపే సమయంలో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఉమా మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరు పరిధిలోని గోపవరం పశువైద్య కళాశాల బృందం జాతీయ సేవ పథకం కింద ప్రత్యేక పశువైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు ఆ పథకం అధికారి డా.పి.కళ్యాణి శుక్రవారం తెలిపారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ రాముడు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆరిస్ కంపెనీ, విరోభ్యాక్ కంపెనీలు ఉచితంగా మందులను అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోట్లదుర్తి పశువైద్యశాల వైద్యాధికారి డా.వై. జ్యోతి, డా. ప్రశాంత్, జూనియర్ డాక్టర్లు, పశువైద్యశాల క్లినికల్ విభాగ ఆచార్యులు సరిత, వి.జ్ఞాని చరిత, ఎం.భాస్కర్‌లు పాల్గొన్నారు. గర్భాశయ సమస్యలు, పాల ఉత్పత్తి పెరుగుదలకు అవసరమైన సూచనలను పశువైద్యులు అందించారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయండి



మ్యాన్ హోల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందులలోని జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను, భూగర్భ డ్రైనేజీ పనులను, సిమెంటు ఇటుకల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచి ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. భూగర్భ మ్యాన్ హోల్స్ ఎత్తు కచ్చితంగా రోడ్డు నిర్మాణ లెవెల్ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ బాల గంగన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

– వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక భాకరాపురంలోని ఆయన తన నివాసానికి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అర్హులైన వారికి పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు.

గోపరాజుపల్లెలో మూడు డెంగీ కేసులు

పెండ్లిమర్రి : మండలంలోని తుమ్మలూరు గ్రామ సచివాలయం పరిధిలోని గోపరాజుపల్లె గ్రామంలో మూడు డెంగీ కేసులు నమోదు అయ్యాయి. శుక్రవారం గోపరాజుపల్లె గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో లార్వా, ఫీవర్ సర్వే చేసి దోమలు వ్యాప్తి చెందకుండా హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామస్తులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య తెలిపారు.. పరిష్కరించారు



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ సురేష్‌యాదవ్

చెన్నూరు : సచివాలయంలోని –1 పరిధిలోని మైనారిటీ కాలనీలో డ్రైనేజీ పనులను చేపట్టారు. శుక్రవారం పనులను ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, నాయకులు అన్వర్‌బాషా, అబ్దుల్ రబ్, మండల ఉపాధ్యక్షులు వారిస్, ఎంపీటీసీ సాదక్ అలీ ఆధ్వర్యంలో పరిశీలించారు. తమ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని గడప గడపకు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన పనుల నిమిత్తం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దీంతో రూ.5 లక్షలతో పారిశుధ్య పనులు, డ్రైనేజీల నిర్మాణం చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జుమన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కరీం, మాజీ ఎంపీటీసీ మునీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

లింగాల : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి అని ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ శేషారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోనాల గ్రామంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా వాటర్ షెడ్ డీడబ్ల్యూసీ– పీఎం కేఎస్‌వై పథకం ద్వారా శుభ్రత – పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మానవాళి రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. దీంతో ఆర్థిక అభివృద్ధి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, వాటర్ షెడ్ పీఓ రఘునాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంజన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అన్నదాన సత్రం

- అక్రమ నిర్మాణమంటూ కూల్చివేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులు, పోలీసులు
- అడ్డుకున్న స్థానికులు

జమ్మలమడుగు : మండల పరిధిలోని గండికోట సమీపంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రభుత్వ స్థలంలో ఆలయ కమిటీ అన్నదాన సత్రంను ఏర్పాటు చేశారు. పర్యాటక కేంద్రమైన గండికోట ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో అన్నదాన సత్రాన్ని కూల్చివేసేందుకు గురువారం రాత్రి పదిగంటల ప్రాంతంలో క్రేన్‌తో వెళ్లగా విషయం తెలుసుకున్న స్థానికులు కూల్చివేతను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా సత్రాన్ని ఎలా నిర్మించారంటూ ఆలయ కమిటీని పోలీసులు అధికారులు ప్రశ్నించారు. స్థానికుల ఆందోళనతో అక్రమ కట్టడాన్ని కూల్చని అధికారులు, రెండు, మూడు రోజుల్లో అక్రమ నిర్మాణాన్ని కూలిచ్చివేస్తామంటూ రెవెన్యూ సిబ్బంది పేర్కొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

లింగాల : ప్రతి ఒక్కరూ డెంగీపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. శుక్రవారం లింగాల పీహెచ్‌సీ పరిధిలోని చిన్నకుడాల గ్రామంలో డ్రై డే – డ్రై డే సందర్భంగా ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి తొట్లలో అబైట్‌ను పిచికారి చేసి మలేరియా, డెంగీ నివారణ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, నాగేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి నవీన్ తాజ్, ఆశా కార్యకర్తలు సౌభాగ్యమ్మ, రమాదేవి, 104 ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన సంఘటనలో ఇరువురికి జైలు శిక్ష

మైలవరం(జమ్మలమడుగు రూరల్) : మండల పరిధిలోని చిన్న కొమెర్ల గ్రామంలో 2016 సంవత్సరంలో రమణమ్మ మహిళపై దాడి చేసిన సంఘటనలో విజయలక్ష్మి, భర్త రామచంద్రారెడ్డిలను జమ్మలమడుగు సివిల్ కోర్టు జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ శుక్రవారం జైలు శిక్ష విధించారు. తలమంచిపట్నం ఎస్ఐ గోపీనాథ్‌రెడ్డి ఇచ్చిన వివరాలు ఇలా.. చిన్న కొమెర్ల గ్రామంలో 2016 సంవత్సరంలో బచ్చు వెంకట కొండారెడ్డి భార్య రమణమ్మ తోడి కోడలు విజయలక్ష్మి ఇరువురు ఇంటి ముందర మురుగునీళ్లు పారిన విషయం పై గొడవ పడ్డారు. ఈసంఘటనలో రామచంద్రారెడ్డి, భార్య విజయలక్ష్మి ఇద్దరు కలసి రమణమ్మపై దాడి చేశారు. దీంతో రమణమ్మ భర్త వెంకట కొండారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నేరం రుజువు కావడంతో మొదటి ముద్దాయి రామచంద్రారెడ్డికి ఒక సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష, రూ. 7,500 జరిమాన, రెండవ ముద్దాయి విజయలక్ష్మి ఒక నెల జైలు శిక్ష రూ. వెయ్యి జరిమాన విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం

లింగాల : మండల పరిధిలోని బోనాల గ్రామంలోని జగనన్న కాలనీలో శుక్రవారం ఎంపీడీఓ సురేంద్రనాథ్ హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు.

వేసవి దృష్ట్యా ముందస్తు ప్రణాళికలు

ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి



నీటి సంపును పరిశీలిస్తున్న ఎర్రగుంట్ల హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : వేసవిలో మునిసిపల్ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎర్రగుంట్ల మునిసిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కమలాపురం పరిధిలోని అదినిమ్మాయిపల్లి వద్ద ఉన్న ఎర్రగుంట్ల మునిసిపల్ నీటి సంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని ప్రజలకు వేసవికి సరిపడా నీటిని అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే అదినిమ్మాయిపల్లి వద్ద అదనంగా మరో ఫిల్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ఎర్రగుంట్లకు వేసవిలోనూ నీటి సరఫరా జరుగుతుందన్నారు. అంతేకాక పెన్నానది ఒడ్డున ఉన్న నీటి సంపుల నుంచి ఎర్రగుంట్ల నీటి సరఫరా అవుతుందన్నారు. మునిసిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్‌రఫీ, మున్సిపల్ ఏఈ సురేష్‌తోపాటు ఇతరులు పాల్గొన్నారు.

ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కమలాపురం : వైద్య ఆరోగ్య శాఖ ఫీల్డ్ స్టాఫ్‌కు ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీఎన్జీఓ తాలుకా అధ్యక్షుడు నాగలక్ష్మిరెడ్డి, కార్యదర్శి వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పని చేసే ఫీల్డ్ స్టాఫ్ అయిన వీఆర్‌ఓ, సర్వేయర్లకు ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అదే విధంగా వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందికి సర్వర్ సమస్యలతో ఫేస్ అటెండెన్స్ వేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో సైతం ఫీల్డ్ స్టాఫ్ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం వీటిని దృష్టిలో పెట్టుకుని వైద్య ఆరోగ్యశాఖ ఫీల్డ్ స్టాఫ్‌కు ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయింపునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుంటాం

కొండాపురం : కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకంటామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యాక్షుడు చాంద్‌బాషా, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 27న విశాఖలో జరిగే కార్మిక మహాగర్జనకు మద్దతుగా 23, 24 తేదీల్లో రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ వద్ద దీక్షలు చేపడుతున్నామన్నారు. 25న కలెక్టర్ ఆఫీస్‌ల ఎదుట నిరసనలు చేస్తామన్నారు. పోరాట ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమని కేంద్రం ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం తన అనుచరులకు కారు చౌకగా సంస్థలను అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలియజేశారు. అనంతరం దీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వి. సుదర్శన్‌రెడ్డి, పి. వెంకటరమణ, తారాదేవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోల్పోతామనే భయంతో అసత్య ఆరోపణలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై టీడీపీ నేతల వ్యాఖ్యలను ఖండించిన కొండాపురం వైఎస్సార్‌సీపీ నేతలు



విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొండాపురం : సొంత మండలంలో తమ ఉనికి ఎక్కడ కోల్పోతామనే భయంతో దేవగుడి కుటుంబం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి హరినారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ జి. విజయభాస్కర్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని తాళ్ళప్రొద్దుటూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ గతవారం ధర్మాపురం– దానవులపాడు గ్రామాల మధ్య జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రమాదస్థలిలోనే రూ.2లక్షలు ఆర్థికసాయం చేయడమే కాక ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు అందేలా చేశారన్నారు. బాధితులకు ఎమ్మెల్యే సాయం చేయడాన్ని రుచించని దేవగుడి సోదరులు ఎమ్మెల్యేవి శవ రాజకీయాలని ఆరోపించడం శోచనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, పెంజి పెద్దిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

బైకులకు నిప్పు పెట్టిన వ్యక్తి కోర్టుకు హాజరు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

వేంపల్లె : వేంపల్లెలో ఇటీవల వరుసగా ద్విచక్ర వాహనాలు, ఒక కారుకు నిప్పు పెట్టిన సంఘటనలో మానసిక పరిస్థితి సరిగా లేని వ్యక్తిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వేంపల్లెలో నాలుగు బైకులు, ఒక కారు దగ్ధమైన సంఘటనలో ఓ మతిస్థిమితంలేని వ్యక్తి చేసినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు విశాఖపట్టణంలోని మానసిక రోగుల ఆసుపత్రికి తరలించి అతడికి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. మోటార్ బైకులకు నిప్పు పెట్టిన కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా వాహనాలను సురక్షితమైన ప్రాంతాలలో పార్కింగ్ చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదనపు సిబ్బందితో రాత్రి సమయంలో పోలీసు గస్తీ ముమ్మరం చేసినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రఘురాం, తిరుపాల్ నాయక్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి జగనన్న కాలనీ లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని.. అందుకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా ప్రగతి పథంలో నడుస్తోందని.. వేంపల్లె మండలాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే బాధితుల నుంచి తన దృష్టికి వచ్చిన పలు సమస్యలపై స్పందిస్తూ వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రమేష్‌రెడ్డి, ఈఓపీ రవిశంకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు అండగా సీఎం

ఈడిగ సంఘ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్

వేంపల్లె : రాష్ట్రంలోని కల్లుగీత కార్మిక కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఈడిగ సంఘ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ మృతి చెందిన కల్లుగీత కార్మిక కుటుంబానికి ఇచ్చే ఎక్స్‌గ్రేసియోను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. అలాగే కల్లు గీత కార్మికుల నుంచి వసూలు చేసే తాటిచెట్టు అద్దెను కూడా రద్దు చేయడం హర్షణీయమన్నారు. అంతేకాక ఎన్ఆర్ఈజీఎస్, షెల్టర్ బెడ్ తదితర అభివృద్ధి పథకాల కింద తాటి, ఈత వంటి చెట్ల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వైఎస్సార్ గీత కార్మిక భరోసా పథకంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. గీత కార్మికుల కుటుంబాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించిన జేసీ



భానుకోట సోమేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలిస్తున్న జేసీ సాయికాంత్ వర్మ

సింహాద్రిపురం : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట సోమేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను శుక్రవారం జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు పరిశీలించారు. సోమేశ్వరస్వామి ఆలయం పునః నిర్మాణ పనులకు టీటీడీ వారు రూ.4కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో ఆలయ పునఃప్రారంభం సందర్భంగా కుంభాభిషేకం, సంప్రోక్షణ పనులను, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శంకర బాలాజి, ఆలయ ఈఓ విశ్వనాథ రెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారి బద్రి నాథశర్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.